# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# అనుసంధానంలో తిరకాసు

**తమిళనాడులో** ఏ మాత్రం సందు దొరికినా కాలు మోపాలని బీజేపీ తెగ ఆరాటపడుతున్నది. ప్రధాని నరేంద్ర మోదీ ఆ రాష్ట్రంలో అదేపనిగా చక్కర్లు కొడుతున్నారు. తమిళ తంబిలను దువ్వేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నదుల అనుసంధానం అంశాన్ని కేంద్ర సర్కారు బయటకు తీయడం గమనార్హం. ఇచ్చంపల్లి ఎత్తు పెంచి తమిళనాడుకు నీళ్లను తరలించే లివర్ లింకు గురించి పార్లమెంటు ఎన్నికల పోరు ఊపందుకున్న సమయంలో నేషనల్ వాటర్ డెవలప్ మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) అనే కేంద్ర సంస్థ చేస్తున్న హడావుడిని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి అయినా తమిళనాడుకు నీళ్లు అందిస్తామనే ధోరణిలో ఆ సంస్థ మాట్లాడటం అనుమానాలకు తావిస్తున్నది.

గోదావరి-కావేరీ అనుసంధానానికి ఛత్తీస్‌గఢ్ వాడుకోకుండా వదిలేస్తున్న 148 టీఎంసీల నీటిని వాడుకుంటామని కేంద్రం అంటున్నది. గోదావరి నుంచి కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలానికి, అటునుంచి తమిళనాడులోని కావేరీ బేసిన్‌కు నీళ్లను తరలించే ప్రక్రియను ముందుకు తీసుకుపోతున్నట్టు కేంద్రం సంకేతాలిస్తున్నది. దీనివల్ల అంతిమంగా తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చంపల్లి నిర్మాణం వల్ల బరాజ్ ఎగువన ఉండే తెలంగాణ ప్రాజెక్టులు ముంపునకు గురవుతాయి. దిగువన ఉండే ప్రాజెక్టులకు నీళ్లందవు. అన్నిటికన్నా కీలకమైన అంశం మేడిగడ్డ బరాజ్ భవిష్యత్తు. కొత్త రాష్ట్రమైన తెలంగాణకు ఒక్క జాతీయ ప్రాజెక్టు ఇవ్వని కేంద్రం తెలంగాణకు కొత్తజీవం పోసిన మేడిగడ్డ బరాజ్‌ను పండబెట్టేందుకు కుట్రలు పన్నుతున్నది. మేడిగడ్డ మరమ్మతులపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక రాకముందే.. అది నిరర్థకమైతే ఇచ్చంపల్లి డ్యాం ఎత్తు పెంచి ఇటు తెలంగాణకు, అటు తమిళనాడుకు నీళ్లు తరలిస్తామని కేంద్రం అనడం కచ్చితంగా పెద్ద కుట్రేనని చెప్పాలి. దీనివల్ల తెలంగాణకు ముంపు సమస్య తలెత్తడమే కాకుండా నీటి హక్కులూ ప్రమాదంలో పడతాయి. ఇది భావావేశాలతో కూడుకున్న అంశం. దీని వెనుకనున్న అసలు ఉద్దేశాలు ఏమిటో విడిగా చెప్పాల్సిన పనిలేదు.

తమిళనాడుకు నీటిని ఎలాగైనా తరలించుకుపోతామని హంగామా చేయడాన్ని ఎలా చూడాలి? జాతీయపార్టీలు రైల్వేల వంటి ప్రజాసేవా విభాగాలను స్వీయ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవటం మనకు తెలిసిందే. ఇప్పుడు ప్రాజెక్టులు, నదీజలాలు ఆ కోవలోకే వచ్చి చేరాయన్న మాట. నదుల అనుసంధానంలో పరీవాహక ప్రాంతాల అవసరాలు, హక్కుల పరిరక్షణ తప్పనిసరి. అంతర్జాతీయ సంప్రదాయాలూ ఇదే చెప్తున్నాయి. ప్రాజెక్టులు కట్టి ఉంటే వాటి మేరకు నీటి హక్కులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు నదుల అనుసంధానం పేరు మీద ఇచ్చంపల్లిని ప్రతిపాదించి తెలంగాణ నీటి భరోసాను ప్రమాదంలో వేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. కండ్లల్లో వత్తులు వేసుకొని కాళేశ్వరం కట్టించిన కేసీఆర్ అధికారంలో లేకపోవడమే ఈ బరితెగింపునకు కారణమని చెప్పాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే ప్రాంతీయ పార్టీ నేతగా కేసీఆర్ తపన వేరేగా ఉంటుంది. ఆ సోయి లేని ఢిల్లీపార్టీలకు అధికారం అప్పగిస్తే అంతిమంగా నష్టపోయేది మన రాష్ట్రం, మన ప్రజలే. ఇచ్చంపల్లి ప్రతిపాదనే ఇందుకు నిదర్శనం.

# జాతీయ పార్టీల జులుంపై గులాబీ గళం

*ఇప్పుడు మనం వేయబోయే ఓట్లు ఎంపీలను పార్లమెంటు మెట్లు ఎక్కిస్తాయి. కేంద్రంలో మళ్లీ పీఠం తమదేనని, ఆ పీఠం తమ హక్కు అని ఎన్డీయే భావిస్తున్నది. కాదు, కాదు ఈసారి అధికారం తమదేనని ఇండియా కూటమి అంటున్నది. ఎన్డీయేకు నేతృత్వం వహిస్తున్న బీజేపీ-మోదీ, ఇండియా కూటమిని నడిపిస్తున్న కాంగ్రెస్-రాహుల్ ప్రజలపైనే ఒక రకమైన జులుం చేస్తున్నాయి. రాజ్యాంగాన్ని మార్చడానికే 400 ఎంపీల గెలుపు లక్ష్యాన్ని మోదీ విధించుకున్నారని ప్రజలను కాంగ్రెస్ హెచ్చరిస్తున్నది. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. మంగళ సూత్రాలనూ విడవకుండా ఆస్తులు చెరబడుతుందని మోదీ భయపెడుతున్నారు.*

***పౌరుల మెప్పు, విశ్వాసం పొందడానికి బదులు బెదిరించి, భయపెట్టే రకంగా జులుం కాని జులుం ప్రదర్శిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో లోక్‌సభలో గులాబీ గళం ధ్వనించాలనే ఆకాంక్షకు విస్తృతి పెరుగుతున్నది. ఏ అంశాన్నైనా పాలకు పాలు, నీళ్లకు నీళ్లలా వేరుచేసి విశదీకరించి చెప్పే కేసీఆర్ వంక నిజానిజాల కోసం జనావళి చూస్తున్నది. నాయకత్వ లోటు పుణికిపుచ్చుకున్న ఇండియా కూటమి హస్తాలే ఎన్డీయే హ్యాట్రిక్ పల్లకి మోయాలని మోదీ కోరుకుంటున్నట్టే కాంగ్రెస్ చేజేతులా చేస్తున్నట్టుంది!***



ఇల్లెందుల దుర్గాప్రసాద్
94408 50384



**కేం**ద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే పుస్తెలతాడును వదలకుండా ఆస్తులు గుంజుకుంటుందనే భ్రాంతిని స్వయానా మోదీ సృష్టిస్తున్నారు. నిజానికి చట్ట వ్యతిరేకం కానంతవరకూ ఎవరి వ్యక్తిగత ఆస్తులూ లాక్కోనే వీలుండదు. అక్కడిదాకా వస్తే సెంట్రల్‌లో ఏ పార్టీ/ ఏ అలయెన్స్ అధికారంలోకి వచ్చినా అంతే. కాబట్టి మోదీ, బీజేపీ మాయలోకి జారకుండా మోదీ-షా ద్వయం ప్రచారం చేస్తున్న సందేహాలు కేవలం అపోహలేనని జనాలకు సావధానంగా చెప్పగలిగే ఘనమైన గొంతుగా కేసీఆర్‌ను చూస్తున్నారు.

విదేశాల్లోంచి మన దేశపు నల్లధనం రికవరీ చేసి, ఇంటింటికీ రూ.15 లక్షలు పంచడమే రెండు పర్యాయాల సుదీర్ఘ కాలంలో మోదీ సర్కారుకు సాధ్యం కానప్పుడు.. మన దేశ మెజారిటీ ప్రజల ఆస్తులు గుప్పిట పట్టి మరో మతం వాళ్లకు పంచడం కాంగ్రెస్‌కైనా, ఇండియా కూటమికైనా ఎట్లా సంభవం? ఈ సూక్ష్మాన్ని ప్రజలకు వివరించడంలో హస్తం విఫలమవుతున్నది. ఎంతసేపు మతోన్మాద పార్టీ అంటూ బీజేపీని, మోదీని తిట్టడమే కాంగ్రెస్ చేస్తున్న పని. ఆ తరహా చివాట్లు, మూస ధోరణుల వల్లే వరుసగా రెండుసార్లు విజయంతో కమలం విరబూసి మురిసింది. ఇండియా కూటమిని లీడ్ చేస్తున్న కాంగ్రెస్ చెయ్యితోనే ఎన్డీయే హ్యాట్రిక్ పల్లకీ మోయించాలనే మోదీ అప్‌డేటెడ్ ప్లాన్ కిటుకు కనిపెట్టలేక రొటీన్ విమర్శలకే పరిమితం అవుతున్నది. అయోధ్యలో రామాలయానికి అదనంగా తన మేనియా నెలకొన్న మోదీ మొదటి దశ పోలింగ్ సరళి మేరకు ఇప్పుడు వ్యూహాల్లో ఆస్తులకు అపాయమనే బూచిని ఉపాయంగా జత చేశారు. మతం పేరిట ఓట్ల రాజకీయాలనే ముద్ర మరింత గట్టిగా నాటుకోవాలి. ఆ మేరకు తానే మెజారిటీ వర్గమైన ఓటరు మైండ్‌లో సెటిలవ్వాలి. తాను చెప్పేదానికన్నా కాంగ్రెస్, వామపక్షాలే ఎక్కువగా మొత్తుకొని టాంటాం చేయాలి. తద్వారా కాంగ్రెస్ వల్ల తమకు ఇంత నష్టం పొంచి ఉంటుందనే భావనతో దేశంలోని 144 కోట్ల జనాభాలోని మెజారిటీ ప్రజల ఆదరణ కొనసాగాలి. అత్యధికులైన మతం వారి సంఘటితంతో టోకున ఈవీఎంలపై మీట నొక్కించుకోవాలనేదే మోదీజీ అసలైన కిటుకు బోధపడుతున్నది.

అయోధ్యలో రాములోరి కోవెలతో ప్రజల్లో ఆధ్యాత్మిక సంతృప్తి కలిగించిన మోదీకి ఇంకా ఏదో వెలితి తోచినట్టుంది. వీస్తున్నట్టుగా భావిస్తున్న తన గాలి మీదా మనసు పూర్తిగా నిండటం లేదేమో. కేంద్రపాలిత ప్రాంతాలు సహా 21 రాష్ట్రాల్లో 102 చోట్ల ముగిసిన తొలి దశ పోలింగ్ సరళి మోదీకి ఎటువంటి ఉప్పందించిందో! అకస్మాత్తుగా ఎప్పుడో 2006లో నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ వ్యాఖ్యలుగా ప్రధాని నరేంద్ర మోదీ 18 ఏండ్ల అనంతరం ఉటంకిస్తున్నారు. మెజారిటీగా ఉన్న ఒక మతం వారి ఆస్తులు లాగేసి మైనారిటీలకు పంచడమే ఇండియా కూటమి విధానమనే భయాన్ని పౌరుల మీదికి మోదీ విసురుతున్నారు.

రాజస్థాన్‌లో ఆ విధంగా గురిపెట్టి.. యూపీ మీదుగా అంతకుమించిన ఊపుతో దక్షిణాదికి రేపో ఎల్లుండో రాబోతున్నారు. మొత్తానికి దేశంలో ఆ మూల నుంచి ఈ మూలకు పోలింగ్ జరగాల్సిన పార్లమెంటు స్థానాల్లో ఇదే అంశాన్ని హైలైట్ చేసేలా ఉన్నారు. మోదీ-బీజేపీ, కాంగ్రెస్-రాహుల్ గాంధీల గందరగోళ ఉపన్యాసాల్లోని నిజాలను ప్రజలకు వివరించి, మంచి చెడుల చైతన్యం వ్యాప్తి చేయడంలో బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ అవసరం చాలా ఏర్పడుతున్నది. వాస్తవానికి, ప్రాక్టికల్‌కు దగ్గరగా ప్రజలకు వివరించే ఖ్యాతి సొంతమైన కేసీఆర్ దక్షిణాదికి వరమైన జనజీవన స్వరం. సౌత్‌లోని 130 లోక్‌సభ సీట్లలో ఎన్ని ఎక్కువ స్థానాలు గెలువగలిగితే అంతగా అధికారానికి, లక్షిత 400 ఎంపీల బలగానికి ఎన్డీయే చేరువవుతుందనే అంచనాలు, ఆశలతో తెలంగాణపై మోదీ నజర్ పెట్టారు. అలాంటి ఆశలతోనే కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. కాంగ్రెస్, బీజేపీలను వెనక్కు నెట్టి, మెజారిటీ స్థానాల్లో బీఆర్ఎస్‌ను విజేతగా నిలిపేందుకు ప్రజల్లోకి కేసీఆర్ వెళ్తుండటం సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్నది.

**(వ్యాసకర్త:సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)**

# నికార్సయిన నాయకుడు

***ఇది కేసీఆర్ ఓటమి కాదు, తెలంగాణ ప్రజల ఓటమి. ఓడిపోయింది బీఆర్ఎస్ కాదు, తెలంగాణ. పదేండ్ల పాటు రారాజులా బతికిన తెలంగాణ.. నేడు కాంగ్రెస్ పాలనలో గోస పడుతున్నది. సాగు నీళ్లు లేక, పంటలు ఎండిపోయి రైతాంగం తల్లడిల్లిపోతున్నది. తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. 'మార్పు.. మార్పు..' అంటూ కాంగ్రెస్‌ను నమ్మి తినే అన్నంలో మట్టి పోసుకున్నరు.***

**దే**శానికి అన్నం పెట్టే రైతన్న సంక్షేమాన్ని కాంక్షించే పాలకుడే నిజమైన, నికార్సైన దేశ భక్తుడు. ఆ లెక్కన చూస్తే రైతును కంటికి కాచుకున్న తెలంగాణ రథసారథి కేసీఆర్‌ను మించిన దేశభక్తుడు ఎవరున్నారు? దేశభక్తి అంటే నిత్యం తప్పుడు ప్రచారాలు చేయడం కాదు. దేశభక్తి అంటే ప్రజల క్షేమాన్ని కాంక్షించడం. వారి మంచి కోసం నిత్యం మథనపడటం. ఆ గుణం కేసీఆర్‌లో పుష్కలంగా ఉన్నది. పాజిటివ్‌గా ఆలోచించే వాళ్లకు, సమాజాన్ని ప్రేమించే వాళ్లకు మాత్రమే కేసీఆర్ ఆలోచనలు, ఆశయాలు, ఆయన పథకాలు అర్థమవుతాయి. చిల్లర మాటలు మాట్లాడుతూ అదే రాజకీయమని అనుకునేవాళ్లకు కేసీఆర్ ఆలోచనలు, ఆచరణలు అర్థమయ్యే అవకాశమే లేదు. తెలంగాణ ఏమైపోయినా ఫర్వాలేదు కానీ కేసీఆర్ అధికారంలో ఉండొద్దని కుట్రలు చేసే మూర్ఖులు తప్ప బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలందరూ సంతోషంగానే ఉన్నారు. ప్రజలందరి సమస్యలను ఒకేసారి పరిష్కరించడం ఏ పాలకుడికీ సాధ్యం కాదు. ఒకప్పటి తెలంగాణ ఎలా ఉండేది? ఇప్పుడు ఎలా ఉందనేది ప్రతి ఒక్కరికీ తెలుసు. సరైన పాలకుడు లేక నానా కష్టాలు పడుతున్న రాష్ట్రాలు, దేశాలు చాలా ఉన్నాయి. తెలంగాణపై విషం చిమ్మేవాళ్ల మాటలు పొరపాటున నమ్మితే మళ్లీ మన రాష్ట్రం మరో 20 ఏండ్లు వెనక్కివెళ్లిపోతుంది. తెలంగాణ వ్యతిరేకులు ఒక్కటవుతున్నారు. తెలంగాణ ప్రేమికులందరూ ఏకం కాకపోతే నష్టపోయేది మనమే.

కేసీఆర్ ఆషామాషీ నాయకుడు కాదు. తెలంగాణ పట్ల నిబద్ధత కలిగిన నాయకుడు. అందుకే దశాబ్దాలుగా ఎవరికీ సాధ్యం కాని తెలంగాణను సాధించారు. సాధించిన తెలంగాణను ప్రగతి పథంలో నడిపారు. కనీసం మూడు దశాబ్దాల సమయం పట్టే కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టును మూడేండ్లలోనే పూర్తిచేసి తెలంగాణను సస్యశ్యామలం చేశారు. సాగును బాగు చేశారు.

విమర్శలు ఆయనకు కొత్తకాదు. బహూశా ఈ దేశంలో ఆయనకున్నంత శత్రువులు (రాజకీయంగా) ఎవ్వరికీ ఉండకపోవచ్చు. తెల్లారి లేస్తే కేసీఆరే వారి టార్గెట్. అయితే విమర్శ అనేది కొంచెం వివరణాత్మకంగా ఉండాలే. కానీ, ఈ మూర్ఖుల ముఠా చేసే విమర్శలు అర్థం పర్థం లేనివి. ఒక ఆరోపణ చేస్తారు. కానీ, దాన్ని నిరూపించరు. అడ్డదిడ్డంగా మాట్లాడుతారు. ఒక నాయకుడి గురించి మాట్లాడేటప్పుడు కొంత విజ్ఞత అవసరం. ఆ విజ్ఞతను కోల్పోయి వికృత చేష్టలతో కొందరు మూర్ఖులుగా మిగిలిపోతున్నరు. ఎవరో చెప్పేది కాదు, కేసీఆర్ అంటే ఏంటో చరిత్ర చెప్తుంది. ఆయన్ను ఎంత అణగదొక్కాలని చూస్తే అంతకు రెట్టించిన వేగంతో పైకి లేస్తడు. ఇది చరిత్ర చెప్తున్న సత్యం.



ఆలేటి రమేష్
99487 98982

# విషం చిమ్ముతున్న ఎన్నికల ప్రచారం

*'దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపద మొత్తం ముస్లింలకు పంచుతుంది.. మహిళల మంగళసూత్రాలనూ వదలరు, ముస్లింలకే పంచేస్తారు..' రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం ఇది. ఇక మన రాష్ట్రానికి వస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని కూడా మరిచిపోయి 'మానవ బాంబులమవుతాం, పేగులు మెడలో వేసుకుంటా, ఉరికించి కొడతా' అంటూ ప్రసంగిస్తున్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో రాజకీయపార్టీల ప్రసంగాలు ఈ స్థాయిలోనే ఉన్నాయి. ఎన్నికలు, ప్రజాస్వామ్యం అంటేనే ప్రజలు అసహ్యించుకునే స్థాయిలో నాయకుల మాటలు సాగుతున్నాయి.*

***హైదరాబాద్ మహా నగరంలో పాతబస్తీలో కేవలం మత ప్రాతిపదికనే ఎన్నికల ప్రచారం సాగుతుంది. బీజేపీ, ఎంఐఎం పార్టీలు మతం పేరుతోనే ప్రచారం సాగిస్తుంటాయి. ఒక పార్టీ అభ్యర్థి మరో పార్టీ మతానికి చెందిన ప్రార్థనాలయంపైకి బాణం ఎక్కుపెట్టి కొట్టినట్టు నటిస్తే దానికి బోలెడు ప్రచారం. ఇలాంటి కవ్వింపు చర్యలు ఆయా మతాల వారి అభిమానాన్ని సంపాదించవచ్చు, మతం ఓట్లు సంపాదించవచ్చు కానీ, ఆ ప్రచారం సమాజంపై చూపే దుష్ప్రభావం వీరికి అవసరం లేదు. రెచ్చగొడితే ఓట్లు వస్తాయి, విజయం సాధిస్తే చాలు సమాజంపై అది ఎలాంటి ప్రభావం చూపిస్తుందనేది వీరికి అవసరం లేదు.***



బుద్దా మురళి



**బే**గంబజార్‌లో హోల్‌సేల్‌లో గతంలో అల్లం వెల్లుల్లి పేస్ట్ కిలోకు రూ.20 అని తెలిసి ఆశ్చర్యం వేసింది. అప్పుడు అల్లం కిలో వంద రూపాయలు. రూ.100కు కిలో అల్లం ఉంటే దాన్ని పేస్ట్ చేసి రూ.20కి కిలో ఎలా అమ్ముతారు? వ్యాపారుల్లో మరీ ఇంత సేవాభావమా? అని ఆశ్చర్యం వేసి వివరాలు తెలుసుకుంటే, సేవాభావం కాదు, మన్ను కాదు. ఫక్తు లాభాపేక్ష. ఆంధ్రా నుంచి ప్రతి రోజు పెద్ద ఎత్తున నగరానికి అరటి పళ్లు తీసుకువస్తారు. వాటితో పాటు అరటి బోదెలు ఉచితంగా లభిస్తాయి. అరటి బోదెలు, ఆలుగడ్డ పేస్ట్ చేసి, వాసన కోసం కొద్దిగా అల్లం వెల్లుల్లి పేస్ట్ కలిపి అమ్ముతారు. అలా చేయడం అన్యాయం, పాపం కదా? అంటే వారికి కావలసింది వ్యాపారంలో కేవలం లాభమే కానీ, పాపపుణ్యాలు కాదు. ఈ కల్తీ సరుకు తిని ప్రజలు అనారోగ్యాలపాలైనా వారికి అవసరం లేదు. కనికరం ఉండదు, పాపభీతి ఉండదు. సరిగ్గా రాజకీయ వ్యాపారాలు సైతం అంతే. కావలసింది రాజకీయ వ్యాపారంలో లాభమే తప్ప సమాజానికి కలిగే లాభనష్టాల గురించి వారికి పెద్దగా ఆలోచన ఉండదు. రాజకీయపక్షాలు, రాజకీయ నాయకులు రాజకీయాన్ని కేవలం వ్యాపారంగానే చూస్తున్నారు. ప్రజలు సైతం ఇది మనకు సంబంధం లేని వ్యాపారం అన్నట్టుగా వదిలివేశారు. గల్లీ లీడర్లు ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే వేరు, ప్రధాని స్థాయి వ్యక్తి అలా మాట్లాడితే కిందివారు వారినే అనుసరిస్తారు.

బండి సంజయ్‌తో పోటీ పడి నరేంద్ర మోదీ మాట్లాడితే ఏం చేయగలం. దేశ సంపదను అంతా చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలున్నవారికి పంచుతారు, మీ మహిళల మంగళసూత్రాలను కూడా వదలరు, ముస్లింలకు పంచుతారని మోదీ ప్రసంగించారు. ఓట్ల కోసం, ప్రజల మధ్య మతపరమైన విభజన కోసం ఎంతకైనా తెగిస్తామన్నట్టుగా ఉన్నది మోదీ ప్రసంగం. ఎంఐఎం ఇలా ప్రసంగించడం లేదా? అని కొందరు ప్రశ్నిస్తారు. పాత నగరానికే పరిమితమైన ఎంఐఎం ఎన్నికల సభలు, పార్టీ సభలు అర్ధరాత్రుళ్లు జరుగుతాయి. వాళ్లు ఏం మాట్లాడుతారో మీడియాలో కవరేజీ ఉండదు. ఎంఐఎం చేసిన ప్రసంగాలను ప్రస్తావించవచ్చు. పాత నగరంలో ఒక మతానికి పరిమితమైన రాజకీయపక్షంతో దేశాన్ని పాలిస్తున్న ప్రధానమంత్రి మోదీని ఒకేగాటన కట్టి చూడలేం. ఏ వ్యూహం ద్వారా ఎన్నికల్లో ప్రయోజనం పొందుతామనే లెక్కలే ముఖ్యం కానీ ప్రజల మధ్య ఉద్రిక్తతలు తలెత్తితే సమాజానికి కలిగే నష్టం ఏమిటి అనేది వారికి అనవసరం. మతాల మధ్య ఉద్రిక్తతలు ఎంత పెరిగితే వారికి అంత లాభం.

**మైనారిటీలు మొదటినుంచి కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారు. కాంగ్రెస్ ఐదారు దశాబ్దాల పాటు దేశంలో అధికారంలో ఉన్నది. అంటే మైనారిటీ ఓటు బ్యాంకు ఆ పార్టీకి బాగా ఉపయోగపడింది. కర్ణాటక, తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో సైతం మైనారిటీ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిందనేది నిజం. ఆరు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన మైనారిటీ ఓటు బ్యాంకు రాజకీయమే, గత పదేండ్ల నుంచి కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసింది. దశాబ్దాల పాటు మైనారిటీ ఓటుబ్యాంకు రాజకీయాల ద్వారా అధికారాన్ని అనుభవించిన కాంగ్రెస్, ఇప్పుడు మైనారిటీ ఓటు బ్యాంకు రాజకీయాల సైడ్‌ఎఫెక్ట్‌తో అధికారానికి దూరమైంది.**

ఈసారి అధికారంలోకి, సంకీర్ణంలో భాగంగానైనా వస్తుందా? అనే విషయమై స్పష్టమైన సూచనలూ లేవు. అలాంటిది 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులు, మంగళ సూత్రాలతో సహా మైనారిటీలకు కాంగ్రెస్ పంచుతుంది' అని ప్రధాని స్థాయి వ్యక్తి అనడం దురదృష్టకరం. అందరి ఆస్తులు ముస్లింలకు ఇవ్వడం సాధ్యమా? కాంగ్రెస్ ఇప్పుడు పుట్టిన పార్టీ కాదు. దాదాపు ఆరు దశాబ్దాల పాటు కేంద్రంలో పాలించిన పార్టీ. అధికారంలో ఉన్నప్పుడు మంగళసూత్రాలతో సహా అందరివీ తీసుకొని ముస్లింలకు కాంగ్రెస్ ఇచ్చిందా? అలా ఇవ్వడం సాధ్యమా?

దేశంలో పదేండ్ల పాలనలో ఇది చేశాం, మళ్లీ అధికారం ఇస్తే వచ్చే ఐదేండ్లు ఇది చేస్తాం అని చెప్పి ఓట్లడిగితే పెద్దగా ప్రయోజనం ఉండదనుకుంటున్నారు. అందుకే మతపరమైన చీలిక ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని మోదీ బృందం కోరుకుంటున్నది. దీని వల్ల నష్టపోయేది మాత్రం సమాజమే. సమాజ వాతావరణాన్ని ఎంత కలుషితం చేస్తున్నారో వారికి తెలియడం లేదు. గుజరాత్ ఉద్రిక్తతల పుణ్యమాని సీఎం సీటుకు ఢోకా లేకుండా చేసుకోవడమే కాకుండా ప్రధానమంత్రి స్థాయి వరకు వెళ్లారు. అందుకే అదే విజయ సూత్రాన్ని పదే పదే నమ్ముకుంటున్నారు.

'కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందట' అనే సామెత చెప్పినట్టు ప్రధాని రెచ్చగొట్టే ప్రసంగాలను విమర్శిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తమ పార్టీ వారి అనైతిక చర్యలను, రెచ్చగొట్టే ప్రసంగాలను ప్రశ్నించలేక పోతున్నారు, అడ్డుకోలేకపోతున్నారు. ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరి పోటీ చేయడాన్ని రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. తమ పార్టీ తరఫున అలా పోటీ చేస్తున్న వారి గురించి రాహుల్‌గాంధీకి తెలియదా? చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ ఎంపీగా గెలిచి, పార్లమెంట్ సభ్యత్వానికి కూడా రాజీనామా చేయకుండా ఇప్పుడు అదే చేవెళ్ల నుంచి కాంగ్రెస్ తరఫున రంజిత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి శాసనసభకు ఎన్నికై కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నీతులు చెప్పడానికే... ఆచరిస్తే ఆ మాత్రం బలమైన అభ్యర్థులు కూడా దొరకరనుకొని రాహుల్‌గాంధీ వీరి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారేమో. అల్లం పేరుతో అరటి బోదె గుజ్జును అమ్మే వ్యాపారికి, తమ ప్రసంగాలతో సమాజాన్ని కలుషితంగా మార్చి రాజకీయ ప్రయోజనం పొందే రాజకీయ నాయకులకు పెద్దగా తేడా లేదు. స్వచ్ఛ భారత్ అంటూ రోడ్లపై చెత్తా చెదారాన్ని ఏరి పారేయడాన్ని ఒక ఉద్యమంలా ప్రారంభించిన ప్రధాని మోదీ తన రాజకీయ ప్రసంగాల్లో అంతకుమించిన ప్రమాదకరమైన చెత్త పోగుపడుతున్నదనే విషయాన్ని గ్రహించాలి.

**'కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందట' అనే సామెత చెప్పినట్టు ప్రధాని రెచ్చగొట్టే ప్రసంగాలను విమర్శిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తమ పార్టీ వారి అనైతిక చర్యలను, రెచ్చగొట్టే ప్రసంగాలను ప్రశ్నించలేక పోతున్నారు, అడ్డుకోలేకపోతున్నారు. ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరి పోటీ చేయడాన్ని రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. తమ పార్టీ తరఫున అలా పోటీ చేస్తున్న వారి గురించి రాహుల్‌గాంధీకి తెలియదా?**

***ఒరిజినల్ కాషాయ రంగు లోగోలోకి దూరదర్శన్ రావడం ప్రారంభం మాత్రమే. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఒకవేళ బీజేపీ గెలిచి, నరేంద్ర మోదీ సర్కార్ మూడోసారి అధికారంలోకి కనుక వస్తే.. ప్రసారభారతి, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ (ఎంఐబీ)లో భారీగా మార్పులు చేయాలని యోచిస్తున్నట్టు సంబంధిత వర్గాలు న్యూస్ 18కి తెలిపాయి.***

# కాషాయ 'ప్రసారం'!



అమన్ శర్మ

**15** దేశాల్లో బ్యూరోలను అనుసంధానించడం ద్వారా దూరదర్శన్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా అభివృద్ధి చేయడం, ప్రసారభారతికి చెందిన శబ్ద్ పోర్టల్ పరిధిలోకి విదేశీ అవుట్‌లెట్‌లతో సహా 1000కి పైగా మీడియా సంస్థలను తీసుకొచ్చి దాన్ని గ్లోబల్ న్యూస్ ఏజెన్సీగా అభివృద్ధి చేయడం, ఎంఐబీలో ఇంటెలిజెన్స్ హబ్ ఏర్పాటు, సాధారణ పౌరుల కోసం భారత్ నమన్ పోర్టల్‌ను ప్రారంభించడం లాంటివి ఈ ప్రణాళికలో భాగంగా ఉన్నాయి. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్లను వివిధ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా గ్లోబల్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌ను ప్రకటించి, ఫేక్ న్యూస్‌లను అడ్డుకోవాలని భావిస్తుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసీ)లో మాస్టర్ కోర్సును ప్రవేశపెట్టనుంది.


ఇవన్నీ ప్రధాని మోదీ ఆదేశాల మేరకు మోదీ 3.0 కోసం మంత్రిత్వ శాఖలు రూపొందిస్తున్న పంచవర్ష, 100 రోజుల ప్రణాళికల్లో భాగమే. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని దూరదర్శన్ తన నీలి రంగు లోగోను కాషాయ రంగులోకి మార్చడం వివాదాస్పదంగా మారింది. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని ప్రతిపక్షం అభివర్ణిస్తుంది.1982లో ఇందిరాగాంధీ ఎంపిక చేసిన ఒరిజినల్ రంగు ఇదేనని, దాన్నే తాము మళ్లీ పునరుద్ధరించామని బీజేపీ తెలిపింది.

భారతీయ సినిమాలు, ప్రసారాల విదేశీ గుర్తింపును వివరించడం, భారతీయ సాఫ్ట్ పవర్‌ను బలోపేతం చేయడం లాంటివి ప్రసార భారతి ప్రణాళిక అని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇందులో భాగంగా డీడీ ఇండియా, ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఐఎఫ్ఎఫ్ఐ)లను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చదిద్దనున్నారు. డీడీ ఫ్రీ డిష్‌ను పొరుగు దేశాలకు విస్తరించాలని, దాని కింద చానళ్ల సంఖ్యను పెంచాలని కేంద్రం ప్లాన్ చేస్తున్నది. విదేశీ అవుట్‌లెట్‌లతో సహా 1000కి పైగా మీడియా సంస్థలను అనుసంధానించడం ద్వారా ఇటీవల ప్రారంభించిన శబ్ద్ పోర్టల్‌ను భారత గ్లోబల్ న్యూస్ ఏజెన్సీగా అభివృద్ధి చేయనున్నారు.వీడియో, ఆడియో, టెక్స్ట్, ఫొటో, ఇతర రూపాల్లో రోజువారీ న్యూస్ ఫీడ్‌ను వినియోగదారులైన మీడియా సంస్థలకు అందించడానికి ఆడియో-విజువల్ నెట్‌వర్క్ శబ్ద్ రూపొందించబడింది. దేశవ్యాప్తంగా కల ప్రసారభారతి నెట్‌వర్క్‌కు చెందిన రిపోర్టర్లు, కరస్పాండెంట్లు, స్ట్రింగర్లు అందించే ఫీడ్ ఆధారంగా ఇది పని చేస్తుంది.

ఐఐఎంసీలో మాస్టర్ కోర్సును ప్రారంభించే అవకాశం ఉంది. అలాగే ఈ రంగంలో నియంత్రణ చట్టం రూపొందించడానికి బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ బిల్లును కూడా క్యాబినెట్ ముందుకు తీసుకురావచ్చు. బీజేపీ సర్కార్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే ఐజ్వాల్‌లో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ప్రారంభించాలని కేంద్రం ప్లాన్ చేస్తున్నది.

జన్ సంవాద్, భారత్ నమన్ అనేవి మోదీ 3.0 కోసం మరో రెండు భారీ ప్రాజెక్టులని సంబంధిత వర్గాలు తెలిపాయి. రియల్‌టైమ్ ట్రాన్స్‌లేషన్, డబ్బింగ్, సబ్‌టైటిలింగ్, ఏఐ ఆధారిత కంటెంట్ జనరేషన్ కోసం ఎంఐబీలో ఏఐ హబ్ ఉంటుంది.ప్రజల ఉచిత వినియోగానికి ఉచిత కంటెంట్ నేషనల్ వీడియో గేట్‌వేల ఏర్పాటును కలిగి ఉంటుంది.

భారత్ నమన్‌ను జాతీయ భాండాగారంగా (నేషనల్ ఆర్కైవల్),మీడియా యాక్సెస్ కోసం పౌరుల ప్లాట్‌ఫామ్‌గా అభివృద్ధి చేస్తారు. దేశంలోని అన్ని భాషల్లో ఉండే పుస్తకాలు, ప్రసిద్ధ డాక్యుమెంట్లు, ఫొటోలు ఇక్కడ అందుబాటులోకి తెస్తారు. వాణిజ్య అవసరాల కోసం చిత్ర నిర్మాతలు, నిర్మాణ సంస్థలకు వాడుకునే అవకాశం ఇవ్వడం ద్వారా ఆదాయం ఆర్జించే ప్రయత్నాలు జరుగుతాయని విశ్వసనీయ వర్గాలు న్యూస్ 18కు తెలిపాయి.



### ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ఏమిటి?

*దేశ ప్రధాని కూడా భారత పౌరుడే. భారత పౌరులకు, భారత చట్టాలకు ఆయన అతీతుడేమీ కాదు. చట్టాలను ఉల్లంఘించినప్పుడు ఆయనపై కూడా చర్యలు చేపట్టాలి. ప్రధానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోతే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ఏమిటి?*

**- బృందాకారత్,** సీపీఐ(ఎం) నాయకురాలు